క్లుప్తంగా

ట్రిపుల్‌ఐటీకి ఎంపిక


ప్రసన్నకుమార్

నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్‌పహడ్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థి గోనె ప్రసన్నకుమార్ మహబూబ్‌నగర్ ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వామన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు విద్యార్థి ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో 544 మార్కులు సాధించాడన్నారు.

వేతనాలు పెంచాలని డైరెక్టర్‌కు వినతి


వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలను పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు యాజమాన్యాన్ని కోరారు. బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సంస్థ డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రును కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డీ.బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణిలో 30 వేల మంది కాంటాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, 12 సంవత్సరాల నుండి వేతనాలు పెరగడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాశుద్దీన్, ఏ.వెంకన్న, సంజీవ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచాలి

తాండూర్: తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ ఈసా ఆధ్వర్యంలో కాలనీవాసులు బుధవారం ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ ట్రాన్స్‌ఫార్మర్‌పై అధికలోడు పడడంతో నిత్యం విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, నగేష్, మణి, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు సన్మానం

మంచిర్యాలటౌన్: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన మంచిర్యాల ఖేలో ఇండియా బాక్సింగ్ క్రీడాకారులను బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ రాజేశ్, క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రదీప్, ఫిట్‌నెస్ సభ్యులు తులా ఆంజనేయులు, లచ్చన్న, చంద్రకాంత్, అశోక్, అచ్చిబాబు, తోట వెంకటేశ్, శ్రీనివాస్, రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మహిళాశక్తి సంబురాల్లో మహిళలకు ప్రాధాన్యత లేదు'

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఇటీవల నిర్వహించిన మహిళాశక్తి సంబురాల్లో మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాళ్లు ఎం.శ్రీదేవి, రమాదేవి, శ్యామల, మంగ ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు ముందు వరుసలో చోటు కల్పించకుండా అవమానించారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన మండల మహిళా, గ్రామ సమాఖ్య భవనాలు నిర్మించకుండా నిధులు ఇతర పనులకు మళ్లించారన్నారు. సమావేశంలో స్వాతి, స్వప్న, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డు, రెండో వార్డులలో దాసరి లక్ష్మి, చెన్న మహేశ్‌కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణపనులను ఆయా వార్డు అధికారులు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు రాజ్‌కుమార్, నవీద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, నాయకులు పెండ్యాల శ్రీకాంత్, చెన్న వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను సీజ్ చేయాలి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థి మృతి చెందిన ఘటనలో మిమ్స్ హాస్టల్‌ను సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బుధవారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఐఈవో అంజయ్యతో పాటు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సహస్ర కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, ఏఐఎస్‌బీ నాయకుడు సన్నీగౌడ్, యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

నాటు కోళ్లు.. మస్తు లాభాలు

- స్వయం ఉపాధిలో రాణిస్తున్న యువకుడు
- యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్న శ్రావణ్


ఇంక్యుబేటర్‌లో కోడిగుడ్లు


షెడ్డులో పెంచుతున్న నాటుకోళ్లు

జైపూర్: డిగ్రీ వరకు చదివిన ఆ యువకుడు ఉద్యోగాలకోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఉన్న ఊళ్లో ఎలాంటి ఉపాధి అవకాశాలు కనిపించలేదు. పట్టణాల్లో ప్రైవేటు ఉద్యోగంపై పెద్దగా ఆసక్తి లేకపోవడంతో వారికి ఉన్న మామిడి తోటలోనే నాటుకోళ్ల పెంపకం చేపట్టాడు. మొదట్లో అవగాహన లోపంతో అనేక ఒడిదుడుకులను చవిచూశాడు. తెచ్చిన పిల్లలు సకాలంలో పెరగకపోవడం, రోగాలతో మృత్యువాతపడటం, తదితర నష్టాలను చవిచూశాడు. కానీ అతను ఏర్పర్చుకున్న లక్ష్యాన్ని విడిచిపెట్టకుండా మరింత శ్రద్ధపెట్టాడు. మూడేళ్లలో సక్సెస్ అయ్యాడు. ప్రస్తుతం ప్రతీనెల వేలల్లో డబ్బులు సంపాదిస్తూ నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ప్రతీనెల ఆదాయం..

జైపూర్ మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన చెలుకల శ్రావణ్‌కు రసూల్‌పల్లిలో నాలుగెకరాల మామిడితోట ఉంది. అందులో రూ.5 లక్షలు వెచ్చించి 2 వేల నాటుకోళ్లను పెంచే విధంగా ప్రత్యేకంగా షెడ్డు నిర్మించాడు. ముందుగా ఒక్క ఏడాది కరీంనగర్‌కు చెందిన సోనాలీ అసిల్‌క్రాస్ కోడి పిల్లలు తెచ్చి పెంచాడు. కానీ అవి నాలుగు నెలలు గడిచినప్పటికీ సైజు, బరువు పెరగకపోవడంతో పెద్దగా లాభాలు లేక నష్టాలను చూశాడు. ఆ తర్వాత నాటుకోళ్ల పెంపకంపై కొంత అవగాహన ఏర్పర్చుకుని గ్రామంలోని పెరటికోళ్ల పిల్లలు తెచ్చి పెంచాడు. వాటి ద్వారా వచ్చిన గుడ్లను ఇంక్యుబేటర్‌లో ఉంచి పిల్లలను తీశాడు. అలా వందల సంఖ్యలో నాటు కోళ్లను పెంచాడు. ప్రస్తుతం ప్రతీనెల నాటుకోళ్ల గుడ్లను ఇంక్యుబేటర్ ద్వారా పొదిగేసి వాటిద్వారా వచ్చిన పిల్లలను విక్రయిస్తూ ప్రతీనెల సుమారు రూ.50 వేల వరకు ఆర్జిస్తున్నాడు. అంతే కాకుండా ప్రతీ మూడు నెలలకు ఒకసారి సుమారు 400లకు పైగా నాటుకోళ్లను విక్రయిస్తున్నాడు. కిలోకు రూ.450 నుంచి రూ.500ల వరకు పట్టణాల్లో విక్రయిస్తూ సుమారు రూ.2 లక్షల వరకు పొందుతున్నాడు. కోళ్లకు దానా ఖర్చులు పోనూ ప్రతీనెల కోడిపిల్లలను విక్రయించడం ద్వారా రూ.30వేలకు పైగా వస్తుండగా ప్రతీ మూడు నెలలకు ఒకసారి నాటుకోళ్ల విక్రయించడం ద్వారా రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుందని శ్రావణ్ చెబుతున్నాడు. కష్టపడితే సాధించలేనిది ఏదీలేదని నిరూపిస్తున్నాడు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి స్థలాల్లో స్థిర నివాసాలు ఏర్పర్చుకుని నివాసం ఉంటున్న వారికి జీవో 76 ద్వారా ఇళ్ల పట్టాలు ఇప్పించాలని, చేయూత పథకం ద్వారా రూ.4 వేల పెన్షన్, ఆరోగ్య బీమా అమలు చేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, కౌన్సిల్ సభ్యులు పూజారి రామన్న, కొట్టె కిషన్‌రావు, కొత్తపల్లి మహేశ్, ఇలవేణి సారంగపాణి, నాయకులు తంగలపల్లి సురేష్, మొగురం రాకేశ్, కోడి వెంకటేశ్, రంగు రమేశ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిషేధం ఎత్తివేసే వరకు ఆందోళనలు


రోడ్డుపై వంట చేస్తున్న జేఏసీ నాయకులు

జన్నారం: జన్నారం గుండా పగలు భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ నాయకులు బుధవారం వంటవార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాకపోకలు నిలిచిపోవడంతో జన్నారం మండల అభివృద్ధి కుంటుపడుతుందని, మండల ప్రజలపై ధరల భారం పడుతుందన్నారు. నిషేధం ఎత్తివేసేవరకు ఆందోళనలు విరమించేది లేదన్నారు. బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మధుసుదన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజరాం రెడ్డి, సామాజిక కార్యకర్త భూమాచారి, నాయకులు భరత్‌కుమార్, శ్రీనివాసగౌడ్, జనార్దన్, సూర్యం, గోపాల్, గంగాధర్, మల్లయ్యపాల్గొన్నారు.

సెప్టెంబర్ 30 వరకు స్యాచురేషన్ శిబిరాలు


చెక్కు అందిస్తున్న ఆర్‌ఎం అపర్ణారెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆర్థిక చేరికల లక్ష్యంగా దేశ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సెప్టెంబర్ 30 వరకు స్యాచురేషన్ శిబిరాలు నిర్వహించనున్నట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరీంనగర్ ప్రాంతీయ మేనేజర్ అపర్ణారెడ్డి తెలిపారు. బుధవారం గుడిపేట రైతువేదికలో జన సురక్ష శిబిరం నిర్వహించి స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.1.50 కోట్ల రుణ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, డీఆర్‌డీవో కిషన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాధికారుల సమస్యల పరిష్కారానికి కృషి


సన్మానిస్తున్న యూనియన్ ప్రతినిధులు

మంచిర్యాలఅర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహ సంక్షేమాధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు యూనియన్ కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు మోసిన్ అహ్మద్ తెలిపారు. బుధవారం మంచిర్యాల టీఎన్‌జీవో భవన్‌లో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను టీహెచ్‌డబ్ల్యూవో కేంద్ర సంఘం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం నూతనంగా నియామకమైన వసతిగృహ సంక్షేమాధికారులను సన్మానించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి సరిత, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాసిపేట: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీడీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి రోగుల రిజిస్టర్, ల్యాబ్, వార్డు, మందుల స్టాక్ వివరాలు, సానిటేషన్ పరిస్థితులను పరిశీలించారు. మామిడిగూడలో డెంగీ పాజిటివ్ కేసును సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి దివ్య, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్‌లు సరోజ, యశోద, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, హెల్త్ అసిస్టెంట్ నారా యణ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

కోటపల్లి: ఆదివాసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేసినట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న పోడుభూములకు పట్టాలు మంజూరు చేయాలని, అటవీశాఖ అధికారులు దాడులు ఆపాలని, అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని, జీవో 49 శాశ్వతంగా రద్దు చేయాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చెడంక మాంతయ్య, తలండి అశోక్, దుగ్నేజైలు, రెడ్డి రమేశ్, కృష్ణ, అర్జయ్య, సంజీవ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రక్చరల్ సమావేశం

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీకి, సింగరేణి యాజమాన్యానికి మధ్య బుధవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా స్థాయి స్ట్రక్చరల్ సమావేశం జరిగింది. జీఎం ఎం.శ్రీనివాస్, ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అనిల్‌కుమార్, ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ షేక్ బాజీసైదా, ఇతర ప్రతినిధులు పాల్గొని కార్మికుల సమస్యలపై చర్చించారు.

విద్యార్థినులకు సన్మానం


సన్మానం పొందిన బాలికలు

బెల్లంపల్లి: హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ మైనార్టీ గురుకులాల స్పోర్ట్స్, గేమ్స్ పోటీల్లో పాల్గొని బెల్లంపల్లి మైనార్టీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. సదరు విద్యార్థులు సన అంజుమ్, శృతి, సలోమి (అండర్–17), సాయి చందన, శృతి, సలోమి, సన అంజుమ్, అదిబా(అండర్–19)ను తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ సెక్రెటరీ బాబా షఫీ ఉల్లాఖాన్ ఘనంగా సత్కరించా రు. మెమొంటోలు అందజేసి అభినందించారు.

శతాధిక వృద్ధురాలు మృతి


వహీదాబీ (ఫైల్)

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని కాజీపుర కాలనీకి చెందిన వహీదాబీ (115) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. వృద్ధురాలికి ఏడుగురు కుమారులు, నలుగురు కు మార్తెలు సంతానం. పెద్ద కుమారుడు ఖాజా మొహినొద్దీన్‌కు 95 ఏళ్లు. వహీదాబీ భర్త మొహియోద్దీన్ 30 ఏళ్ల క్రితం మృతి చెందారు.

మోసం చేసి దాడి చేశారు..

శ్రీరాంపూర్: ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేయడమే కాకుండా మోసాన్ని ప్రశ్నించినందుకు తనపై దాడి చేశారని బాధితుడు నీరటి సురేశ్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కే 6 కొత్తరోడ్ ప్రాంతానికి చెందిన ఏ.రాజేశ్ తనకు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో రూ.6 లక్షలు ఇచ్చానని, మూడేళ్లు కావచ్చినా ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు ఇవ్వాలని కోరామన్నారు. ఈ నెల 29న తాను ఉండే కృష్ణాకాలనీకి చెందిన అక్బర్ ఫోన్‌చేసి తనను శాంతి స్టేడియం వద్దకు రమ్మనడంతో వెళ్లగా అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న కొందరు తనపై దాడి చేశారన్నారు. అంతే కాకుండా కులం పేరుతో దూషించారన్నారు. దాడి అనంతరం సురేశ్ మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను ఎస్సీ, ఎస్టీ మానిటర్ సభ్యుడు జే.వెంకటేశ్ పరామర్శించారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సురేశ్ డిమాండ్ చేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

మంచిర్యాలటౌన్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ల్యాబ్, డ్రగ్‌స్టోర్‌ను పరిశీలించారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జన్నారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం మంచిర్యాల అదనపు కలెక్టర్ చంద్రయ్య తనిఖీ చేశారు. బాధ్యతలు చేపట్టిన మొదటిసారి కార్యాలయానికి వచ్చిన ఆయనకు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. 'భూభారతి' వివరాలు తెలుసుకున్నారు. మొర్రిగూడ సమీపంలోని రాఘవేంద్ర రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ఆయన వెంట డీటీ రామ్మోహన్, ఆర్‌ఐ భానుచందర్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని ధర్నా


ఏఈకి వినతిపత్రం ఇస్తున్న వినియోగదారులు

భీమిని: మండలంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినియోగదారులు బుధవారం కన్నెపల్లి సబ్‌స్టేషన్ ఎదుట రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్నెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. మండల కేంద్రంలోని బ్యాంక్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయినా పట్టించుకోవడం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై భాస్కర్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం ఏఈ రాజసర్సుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి, మాడవెల్లి, ఐదపల్లి గ్రామాల విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని యూరియా తిప్పలు


కూపన్ల కోసం గుమిగూడిన రైతులు

తాండూర్: రైతులను యూరియా కొరత వెంటాడుతోంది. ఈ వ్యవసాయ సీజన్ ప్రారంభం నుంచి యూరియా సరఫరా అరకొరగానే ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. యూరియా కోసం వ్యవసాయ సహకార కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రానికి 850 బస్తాల యూరియా రావడంతో విషయం తెలుసుకున్న రైతులు కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తూ వర్షంలో అనేక పాట్లు పడ్డారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాండూర్: మండలంలోని పెగడపల్లిలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి మాట్లాడుతూ పదేళ్లుగా భూములు సాగు చేసుకుంటున్నప్పటికీ నేటికీ పట్టాలివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకృష్ణదేవరాయులు, భరత్‌కుమార్, రామగోని మహేందర్‌గౌడ్, పుట్ట కుమార్, దుర్గా చరణ్, ఏముర్ల ప్రదీప్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ యశ్వంత్‌రావు సేవలు అమూల్యం


డాక్టర్ యశ్వంత్‌రావును సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నేత్ర వైద్యనిపుణులుగా పనిచేస్తూ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న డాక్టర్ మహాత్మ యశ్వంత్‌రావు సేవలు అమూల్యమైనవని డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీడీఎంహెచ్‌వోలు డాక్టర్ అనిత, డాక్టర్ సుధాకర్ నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కృపాబాయి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ అనిల్, రిటైర్డ్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు, ఆఫీస్ సూపరింటిండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి, పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ శంకర్, పారామెడికల్ జేఏసీ ప్రతినిధులు అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, వెంకటేశ్వర్, రామమూర్తి, డెమో వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ హెచ్‌ఎంకు సన్మానం


హన్మాండ్లును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గర్శకుర్తి హన్మాండ్లు పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. హన్మాండ్లు–సుశీల దంపతులను ప్రత్యేకంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడుతూ భావి జీవితం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, ఎంఈవో తిరుపతిరెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి రమేశ్, ఎస్‌వోలు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, దొనబండ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నీలేశకచ్‌వాపాల్గొన్నారు.

ఫొటో తియ్యి...పింఛన్ ఇయ్యి


యాప్‌లో ఫొటో తీస్తున్న పోస్టల్ సిబ్బంది

నెన్నెల/దండేపల్లి: తపాలా శాఖ ద్వారా ఇప్పటి వరకు చేతి వేలిముద్రల ద్వారా ఆసరా పింఛన్ అందించే విధానానికి తెరపడింది. బుధవారం నెన్నెల, దండేపల్లి మండల కేంద్రాల్లో ముఖచిత్రం (ఫేషియల్ రికగ్నైజ్ సిస్టమ్) సంబంధిత యాప్‌లో నమోదు చేసి పింఛన్‌లు అందించారు. సర్వర్ సమస్య కారణంగా ఒక్కోసారి అంతరాయం ఏర్పడినా లబ్ధిదారులు ఓపికతో నిరీక్షించి పింఛన్ పొందారు. కొంతమంది వృద్ధుల ఐరీస్ యాప్‌లో నమోదు కాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

సంక్షిప్త వార్తలు

నియామకం

పాతమంచిర్యాల: బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా మడిపల్లి సత్యనారాయణను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు తులా మధుసూదన్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజకీయాల్లో అవకాశం కల్పించేందుకు ఆయాపార్టీలపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. నాయకులు లింగన్నపేట విజయ్‌కుమార్, రాజయ్య, కాసెట్టి నానయ్య పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కాపాడాలి

బెల్లంపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతూ టీడీపీ పట్టణ అధ్యక్షుడు టి.మణిరాంసింగ్ బుధవారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు వృద్ధిచెంది డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. బస్తీల వారీగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, గంగాధర్‌గౌడ్, తిరుపతి, రాజయ్య, శ్రీనివాస్, సుభాన్, గోపాల్, రాములు, సత్యనారాయణ, అజ్గర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

వేమనపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికతో పాటు నీల్వాయి రైతు వేదికలో గురువారం రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. వేమనపల్లితో పాటు సుంపుటం, దస్నాపూర్, సూరారం, జిల్లెడ, నీల్వాయి, కేతన్‌పల్లి, ముల్కలపేట, చామనపల్లి, గొర్లపల్లి గ్రామాల రైతులు పాల్గొనాలని సూచించారు.

మొగిపురుగు ఉధృతి నియంత్రించాలి

వేమనపల్లి: నాటువేసే దశలోనే వరినారు కొనలు తుంచి మొగి పురుగు ఉధృతిని నియంత్రించాలని ఎంఏవో వీరన్న సూచించారు. మండల కేంద్రంలోని పంట పొలాల వద్దకు వెళ్లి నాటు వేస్తున్న మహిళా కూలీలకు అవగాహన కల్పించారు. నాటు వేసే సమయంలో రెండు నుంచి మూడు కర్రలు ఉండేలా చూడాలన్నారు. అంగులం లోతువరకు నాటువేస్తే వేరు వ్యవస్థ వృద్ధి చెంది పిలకలు వస్తాయన్నారు.